www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 నవంబర్ 2024

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పేరును పాటు జాతీయ స్థాయితో నిలబెట్టాలని యోగి వేమన యూనివర్సిటీ విసి కృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైవీయూలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో తమ ప్రతిభను నిరూపించుకుని గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యం లో యువ ఉత్సవ్ లో (ఇండియా -2047) భాగంగా పలు అంశాల్లో నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. . ముగింపు కార్యక్రమంలో యువ అధికారి మణికంఠ, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ వెంట్రామిరెడ్డి, ప్రొఫెసర్ విజయ భారతి న్యాయ నిర్ణేతలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు, జిల్లా నుంచి సుమారు 700 మంది యువత, నెహ్రు యువ కేంద్ర, వైవీయూ యువ కేంద్ర అధికారి మణికంఠ పాల్గొన్నారు.

స్మార్ట్‌గా షాక్!



- చాపకింద నీరులా స్మార్ట్ మీటర్లు

- ఇప్పటికే పలు ప్రాంతాల్లో బిగించిన విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి ప్రభుత్వం స్మార్ట్‌గా ప్రజలకు షాకిస్తోంది. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్ర స్వరంతో వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇప్పుడు దాని గురించి నోరుమెదపడం లేదు. పైగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆమోద యోగ్యమైదనంటూ సన్నాయినొక్కులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ట్రూ అప్‌ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపిన ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల పేరుతో అధికారులు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఏర్పాటు అయితే విద్యుత్ వినియోగానికి ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తుంది. ముందస్తుగా రీఛార్జి చేయిస్తేనే ఇంటికి విద్యుత్ వచ్చే అవకాశం ఉంది.

ప్రీపెయిడ్ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రీఛార్జి చేస్తేనే విద్యుత్ ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారి దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు అంటూ స్మార్ట్ మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఏ ప్రాంతంలో ఏ మేరకు విద్యుత్ వినియోగంలో ఉంది. లోవోల్టేజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమాచారం విద్యుత్ అధికారులకు వెంటనే అందుతుంది. అయితే వీటిని సాకుగా చూపి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో విద్యుత్ భారాలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోరు మెదపని కూటమి నేతలు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సూచన మేరకు వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అప్పటి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెంట్లకు వీటిని ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు సిద్ధం అయ్యారు. దీనిపై రైతుల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి సైతం మీటర్లను వ్యతిరేకించి వాటిని ఏర్పాటు చేస్తే తాము పగలగొడ తామంటూ ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా విస్త రిస్తున్నా కూటమి నేతలు ఎవరూ నోరు మెదప కపోవడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాలకూ పెద్ద చిక్కే

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ పలు సందర్భాల్లో విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరాను నిలిపేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే కచ్చితంగా ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. వాడిన తర్వాత బిల్లు కట్టడమే కష్టంగా ఉన్న తరుణంలో ముందస్తుగా కార్యాలయాలకు రీఛార్జి చేయించడం అంటే గగనమే అనుకోవాలి. ముందస్తు రీఛార్జి చేయించకుంటే కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తద్వారా ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

రీఛార్జి చేయకుంటే విద్యుత్ కట్

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే వినియోగం తర్వాత బిల్లు చెల్లించే విధానం రద్దు అవుతుంది. సెల్ ఫోన్ల మాదిరి వినియోగించక ముందే ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవసరం అవుతుందో దానిని బట్టి ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. రీఛార్జి మొత్తం పూర్తవగానే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

దుకాణాలకు స్మార్ట్ మీటర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సామాన్యులకు కష్టం

స్మార్ట్ మీటర్లు రీఛార్జ్ చేసుకోవాలంటే సామాన్యులకు కష్టంగా ఉంటుంది. రీఛార్జ్ అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

-సుజాత, గృహిణి, పులివెందుల

గత ప్రభుత్వ విధానాలే

గత ప్రభుత్వ విధానాలనే ఈ ప్రభుత్వం అవలంభిస్తుంది. దీనివల్ల రైతులకు, వ్యాపారులకు ఇబ్బందిగా ఉంటుంది. స్మార్ట్ మీటర్లు పనిచేయకపోతే సరఫరా నిలిచిపోతుంది. బోరు మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి పనిచేయకుండా పోతుంది. దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలి.

-కాశీంవలి, రైతు, పులివెందుల.

మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో మినీ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీలతో పాటు సమానంగా జీతం ఇస్తామని సమ్మెలో గత పాలకులు చెప్పారని పేర్కొన్నారు. ఇప్పటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి మాట్లాడుతూ మినీ అంగన్వాడీలకు వేసవి సెలవులు మంజూరు చేయాలన్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా హామీ ఇచ్చిన మినిట్స్ కాఫీ అమలు చేయాలన్నారు. హెల్పర్ పోస్టు భర్తీ చేయాలన్నారు. అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, నాయకులు ఉదయ్, వినీల, కోటేశ్వరి, లక్ష్మీ, సావిత్రి, వసుంధర, శైలజ, దీప, లక్ష్మి, అంజనీదేవి, విజయ, లక్ష్మి, వరలక్ష్మి, తులసి, రాహుల్, రవి, చార్లెస్,శాంతి, మేరీ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మినీ అంగన్వాడీలు

గుంతల్లేని రహదారులకు ప్రాధాన్యత

- రూ.15.97 కోట్లతో ప్యాచ్‌వర్క్ పనులు
- శరవేగంగా జంగిల్ క్లియరెన్స్
- సంక్రాంతి నాటికి సుందర రహదారులు
- ఆర్అండ్‌బి సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జనవరి-2025 నాటికి గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈనెల రెండున ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు అనకాపల్లిలో గుంతలు లేని రహదారి మిషన్ పను లు ప్రారంభించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆయా అసెంబ్లీ పరిధిలోని రహదారుల్లో ప్యాచ్‌వర్కులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడమైంది. ఈమేరకు జిల్లాలోని 36 మండలాల పరిధిలోని 92 రహదారుల్లో 110 పను లు గుర్తించాం. రూ.15.97 కోట్లతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టాం. ఇందులో కొన్ని రహదారుల్లో పనులు పరుగులు తీస్తుండగా మరికొన్నింట్లో ప్యాచ్‌వర్క్, జంగిల్ క్లియరెన్స్ పనులకు టెండర్లు పిలి చే ప్రయత్నంలో ఉన్నామని పేర్కొంటున్న రహదారుల భవనాలశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.చంద్రశేఖర్‌తో ముఖాముఖి...

జిల్లాలోని రహదారుల విస్తీర్ణమెంత?

జిల్లాలో 3,106.65 కిలోమీటర్ల మేర రహదారులున్నాయి. ఇందులో 356.87 కి.మీ రాష్ట్రస్థాయి రహదారులు, 2,634.17 కి.మీ జిల్లాస్థాయి రహదారులు, 117.6 కి.మీ గ్రామీణ రహదారు లు నిక్షిప్తమై ఉన్నాయి.

ఆర్అండ్‌బి డివిజన్ల వివరాలు చెప్పండి?

జిల్లా రోడ్లు భవనాలశాఖ పరిధిలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్లున్నాయి. వీటి పరిధిలో గుంతలు లేని రహదారుల పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి.

గుంతలు లేని రహదారి పనుల కేటాయింపులు తెలపండి?

రూ.15.97 కోట్లతో గుంతలు లేని రహదారి పనులకు ఆమోదం లభించింది. జిల్లాలోని 3,106.55 కి.మీ పరిధిలో 658 కి.మీటర్ల పరిధిలో ప్యాచ్ వర్కులు ఉన్నట్లు గుర్తించడమైంది. ఇందులోని 92 రహదారుల పరిధిలో 110 పనుల్ని గుర్తించడమైంది. వీటికి అనుబంధంగా ఈనెల 15న జిఒఆర్‌టి 349 ప్రకారం ప్యాచ్ వర్క్‌లతోపాటు అదనంగా జంగిల్ క్లియరెన్స్ పనులు కేటాయించింది. ప్రస్తుతం సదరు పనులకు టెండర్లు పిలిచే ప్రయత్నంలో నిమగ్నం కావడమైంది.

డివిజన్ల వారీ పనుల పురోగతి ఎలా ఉంది?

కడప డివిజన్ పరిధిలో 258 కి.మీ పరిధిలో రూ.166.8 లక్షలతో 21 ప్యాచ్ వర్క్‌లు చేపట్టాం. 710 కి.మీ పరిధిలోని 29 జంగిల్ క్లియరెన్స్ పనులకు రూ.1.09 కోట్లు మంజూరు చేయడమైంది. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 313.3 కి.మీ పరిధిలో 63 ప్యాచ్‌వర్క్‌లకు రూ.16.04 కోట్లు మంజూరు చేయడమైంది. 557. 47 కి.మీ పరిధిలో 12 జంగిల్‌క్లియరెన్స్ పనులకు రూ.52.19 లక్షలు మంజూరు చేయడమైంది. పులివెందుల డివిజన్ పరిధిలో రూ. రెండు కోట్లతో 234 కి.మీ పరిధిలో 25 ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాం. దీనికితోడు రూ.75.07 లక్షలతో 661.88 కి.మీ పరిధిలో 19 జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాల్సి ఉంది.

మున్సిపల్ రహదారుల పనుల గురించి చెప్పండి?

మున్సిపాలిటీల పరిధిలో రూ.8.850 కోట్లతో మూడు పనులకు ఆమోదం లభించింది. రూ.32 కోట్లతో రెండు పనులు పూర్తి చేయడమైంది. రూ.56 కోట్లతో కూడిన పని ప్రోగ్రెస్‌లో ఉంది.

కమలాపురం ఆర్వోబి పెండింగ్‌పై మాట్లాడండి?

రూ.39 కోట్ల వ్యయంతో కూడిన కమలాపురం ఆర్ఓబి పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. భూసేకరణ చేయకుండానే పనులు ప్రారంభించడంతో ఆగినట్లు తెలుస్తోంది. త్వరలో పట్టాలకెక్కించే ప్రయత్నంపై దృష్టి సారించాం.

ఎండిఆర్ ప్లాన్ పనుల పురోగతి ఎలా ఉంది?

రూ.27,503 కోట్లతో 18 మేజర్ డిస్ట్రిక్స్ రహదారులతో ప్రణాళిక సిద్ధమైంది. ఇందులో 53.71 కోట్లతో తొమ్మిది రహదారులను పూర్తిచేశాం. రూ.221.32 కోట్లతో కూడిన తొమ్మిది రహదారులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

ఎస్‌హెచ్, సిఆర్ఐఎఫ్ స్కీముల వారీ వివరాలు తెలపండి?

రూ.109.86 కోట్లతో ఏడు రాష్ట్ర రహదారి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. రూ.30.50 కోట్లతో రెండు రహదారి నిర్మాణాలను పూర్తి చేశాం. రూ.79.36 కోట్లతో కూడిన ఐదు రహదారి నిర్మా ణాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదేతరహాలో సిఆర్ఐఎఫ్ స్కీమ్ కింద రూ.128.46 కోట్లతో ఆరు రహదారి నిర్మాణాలు చేపట్టాలి. ఇందులో రూ.211.0కోట్లతో కూడిన ఒక రహదారి నిర్మాణం పూర్తి చేయడమైంది. రూ.107.36 కోట్లతో కూడిన మిగిలిన ఐదు రహదారి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.

కేంద్ర, రాష్ట్ర స్కీముల రహదారుల నిర్మాణాలు, పురోగతి వివరా లను క్లుప్తంగా చెప్పండి?

రూ.215 కోట్లతో 12 రకాల స్కీముల కింద 210 రహ దారుల నిర్మాణ పనులు చేపట్టాం. ఇందులో రూ.66 కోట్లతో రూ. 102 పనుల్ని పూర్తి చేయడమైంది. రూ.148 కోట్లతో కూడిన 108 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

కాంగ్రెస్, వైసిపి పాలనలో నగర అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి -కడప అర్బన్

కాంగ్రెస్, వైసిపి పాలనలో నగర అభివృద్ధి శూన్యమని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పేరుతో సిసి రోడ్లను తవ్వేసి, అందిన కాడికి దోచుకుని, అండర్ గ్రౌండ్ వ్యవస్థను వృథాగా మార్చారని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి పేర్కొన్నారు. ఆదివారం ద్వారకా నగర్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకుల స్వార్థం వల్ల నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, 20శాతం గృహాలకు నీటి కనెక్షన్ లేదని, ఉన్న గృహాలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదన్నారు. ఆర్ఒ ప్లాంట్ నుంచి వృథా నీటితో ప్రజలు అవసరాలు తీర్చుకుంటున్నారని, పదేళ్ల అధికారంలో ఉండి ఏమి వెలగబెట్టారని సూటిగా ఆమె ప్రశ్నించారు. నీటిని కొనుగోలు చేసి వినియోగించాల్సిన దుస్థితిలో ఉన్నామన్నారు. నీటి సమస్య పరి ష్కారం దిశగా లింగంపల్లి పెన్నా నదిలో చెక్ డాం నిర్మాణానికి టిడిపి ప్రతి పాదిస్తే, అధికారంలోకి వచ్చి ఏమి చేశారన్నారు. ఐదేళ్ల రోడ్లపై గుంతలు పూడ్చలేని పాలన రాష్ట్రంలో కొనసాగిందని చెప్పారు. రోడ్లు, డ్రెయినేజీ సమ స్యలు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సలహాల మేరకు పరిష్కరించామని చెప్పారు. విప్ పదవితో అభివృద్ధిలో కడప నియోజకవర్గాన్ని మరింత ముం దుకు తీసుకు పోతానని హామీ ఇచ్చారు. . వైసిపి పాలనలో రాష్ట్రాన్ని ఆ పార్టీ నేతలు ఆర్థిక అధోగతి పాలు చేశారని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లించక తప్పలేదని, కేంద్ర ప్రభుత్వ ఆర్థికతతో రాష్ట్రం ముందుకు పోతుందన్నారు. గత ప్రభుత్వం ఒకటవ తేదీ పెన్షన్, ఉద్యోగస్తులకు జీతాలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. కోపర్తి ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను తరలించలేదని, దీనిపై అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లని వైసిపి ఎమ్మెల్యేలు బయట ప్రశ్నిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ దశలవారీగా అమలు అవుతాయని, ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని అన్నారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ మాధవి

వేమన పద్య పోటీలకు భారీ స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

రెడ్డి సేవా సమితి రజితోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన వేమన పద్య పోటీలకు విద్యార్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆదివారం 15 ఏళ్లలోపు విద్యార్థులను మూడు డివిజన్ వారీగా విభజించి ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 635 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. 22 మందిని జిల్లా స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురిని కడప డివిజన్ లో విజేతలుగా ప్రకటించారు. ప్రథమ బహుమతి నాగార్జున మోడల్ స్కూల్ విద్యార్థి శ్రీ వైష్ణవి, ద్వితీయ బహుమతి బీవీ జాహ్నవి, తృతీయ బహుమతి అక్కయ్య పల్లె పవన్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని లక్ష్మీ కీర్తన అందుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి ఆదినారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎపివైసి జోనల్ ఇన్‌ఛార్జిగా విజయ్ కుమార్

ప్రజాశక్తి - కడప

యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌ఛార్జిగా మూరతోటి విజయ్ కుమార్‌ను నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆదివారం డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి ఆయన్ను ఘనంగా స న్మానించారు. తన పదవికి కారకులైన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియ జేశారు. త్వరలో జరగబోవు జోనల్ సం బంధించిన అన్ని నియోజకవర్గాలలో పార్టీ కోసం కృషి చేస్తానని తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుశీల్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎన్.డి. విజయజ్యోతి

సీనియర్ బాడీ బిల్డర్‌కు నివాళి

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని మాచుపల్లి బస్టాండ్ సమీపంలో ఉన్న ఫ్రెండ్స్ జిమ్‌లో సీనియర్ బాడీ బిల్డర్ ఎస్. బాషా మృతిచెందారు. ఆదివారం బాడీ బిల్డర్స్ అసోషియేషన్ ప్రతినిధులు శ్రధాంజలి ఘటించారు. .అసోషియేషన్ ప్రతినిధులు, జిమ్ యాజమాన్యం మాట్లాడుతూ ఎస్.ఖాజా బాషా బాడీ బిల్డింగ్ పోటీలలో చురుగ్గా పాల్గొని కడప నగరానికి ఎన్నో పతకాలు తీసుకొచ్చారని చెప్పారు. . బాడీ బిల్డింగ్‌కు ఆయన చేసిన సేవలు మరువ లేనివని అన్నారు. ఇటీవల హటర్మరణం అందరిని కలిచి వేసిందని పేర్కొన్నారు ఎంతోమంది బాడీ బిల్డర్స్ కు తయారు చేశారన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండ లంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పేర్కొన్నారు, ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ సభా భవనంలో ఎంపిడిఒ కుళాయిబాబు ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల మండల అభివృద్ధి ఆగిపోయిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనంగా తయారైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి ఒకవైపు అభివృద్ధిని, మరొకవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుకున్న ఏజెండా ప్రకారం వచ్చే సమావేశం నాటికి అర్హత ఉన్న సమస్యలను పరిష్కారమయ్యేలా చూడాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు, కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ చాంద్ బాషా, మండల డిప్యూటీ తహశీల్దార్ రోనాల్డ్ శామ్యూల్, ఇరిగేషన్ ఇన్‌ఛార్జి డిఇ జగదీశ్వర్‌రెడ్డి, ప్రాథమిక వైద్యాధికారి రాఘవేంద్ర, విద్యుత్ అధికారులు రమణ, విద్యాశాఖ అధికారులు వెంకటరామిరెడ్డి,రమాదేవి సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి మండల కన్వీనర్ టివి కృష్ణారెడ్డి, గంధం మోహన్ బాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డిగోపాల్, రెడ్డి శంకం రెడ్డి, ఆర్ఎస్ బ్రదర్ వీరకుమార్ రెడ్డి, పీరు ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

కమిషనర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప

కడప నగరం 48 డివిజన్, కృపా కాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, బుడగజంగం నాయకులు డి.రాజు, శ్రీరాములు కలిసి గత సోమవారం గ్రీవెన్ లో కమిషనర్ ఎం.మనోజ్ రెడ్డికి లోహియానగర్‌లో నెలకొన్న సమస్యలు వివరించారు. స్పందించిన కమిషనర్ కార్పొరేషన్ అధికారులైన ఎఇ నాగార్జున, సచివాలయం సెక్రటరీ యస్.రోశయ్య, కాంట్రాక్టర్ ఓబుల్ రెడ్డి కాలనీని సందర్శించి ప్రమాదకర గుంతలను పూడ్చే పనులు ఆదివారం చేపట్టారు. ఇందుకు బుడగజంగం కాలనీ, కృపా కాలనీ, లోహియా నగర్ ప్రజలు, పాస్టర్ మహేష్ కమిషనర్‌కు, కార్పొరేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలో ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలు నారాయణ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ పేరుతో వేల కోట్లు వసూలు చేసి పరీక్ష నిర్వహించడం దారుణమని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. ఆదివారం ననగరంలోని పాఠశాలలో టాలెంట్ టెస్టును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు టాలెంట్ టెస్ట్ అనే పేరుతో విద్యార్థులకుఎక్కువ మార్కులు వస్తాయని ఆశ చూపి వేల కోట్ల రూపాయలు వసూలు చేసి అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు ఎక్కువ మార్కులు వస్తాయని, ప్రైజ్‌లు ఇస్తామని, హైయర్ క్లాస్‌కు ప్రమోట్ చేస్తామని మయా మాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోక పోవడంలో లోపం ఏమిటో?ఎందుకు చర్యలు తీసుకోలేదో తెలియాల్సి ఉందని చెప్పారు. ఇప్పటి కైనా నారాయణ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చెప్పడతామని హెచ్చరించారు కార్యక్రమంలో మోహన్ పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - బద్వేలు : నాయి బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తామని జాతీయ బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమించిన కొలవలి వేణుగోపాల్‌ను దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ క్రమశిక్షణ, నైతిక విలువలు, అంకితభావం, నిజాయితీ, పట్టుదల,వినయ విధేయతలు కలిగి వెనుకబడిన వర్గాలకు, తాను పుట్టిన నాయిబ్రాహ్మణ కులం వారికి సేవ చేసి, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వ పార్టీలోని బద్వేలు నియోజకవర్గ టిడిపి నాయకుల గుర్తింపు పొంది సిఎం ఆశీస్సులతో డైరెక్టర్ పదవి పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తన పదవికి కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు నానబాల వెంకటేశ్వర్లు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యు.రమణ యాదవ్, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పి.శ్రీనివాసుల్ రెడ్డి, ఆవాజ్ కమిటీ పట్టణ కార్యదర్శి బి.సి ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) ను సోమవారం నుండి మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బహుభాష కవి సమ్మేళనం ఆదివారం గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. సభాధ్యక్షులుగా లయన్ కె. చిన్నపరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వారోత్సవాల్లో కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తూ కవులను ప్రోత్సహిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులను అభిందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్‌సి సంక్షేమ అధికారి డాక్టర్ వల్లూరు బ్రాహ్మయ్య మాట్లాడుతూ గ్రంథాలయాల విశిష్టతను కొనియాడారు. ఆత్మీయ అతిథి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మనిషిలోని భావాలకు, ఊహలకు అక్షర రూపం ఇచ్చి కవులుగా, రచయితలుగా సాహితీవేత్తలుగా తీర్చుదిద్దుతున్నాయని చెప్పారు. కవులు తెలుగు, ఉర్దూ భాషలలో తమ కవితలను వినిపించారు. కవితల్లో గ్రంథాలయాల విశిష్టత తెలియజేసే కవితలతోపాటు అన్నింటికంటే మానవత్వం మిన్న అంటూ తెలుగు, ఉర్దూ గజల్స్ తమ కవితల రూపంలో లో చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యస్. అమీరుద్దిన్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో కవులు కొండూరు జనార్ధన రాజు, డాక్టర్ యం. పార్వతి, కొత్తపల్లి రామాంజనేయులు, మహబూబ్ యూసఫ్ జయా, లయన్స్ క్లబ్ బాల యల్లారెడ్డి, లయన్ టి.యన్. గౌరీ శంకర్, అతుల్వా అక్తర్, యస్. మధు బాబు, డాక్టర్ అనుగురు చంద్ర శేకర్ రెడ్డి, మక్బూల్ అహమ్మద్ మక్బూల్, సత్తార్ ఫైజి, ఖలీల్ ఖాన్ ఖలీల్ పాల్గొన్నారు.

అతిథులు, కవులతో అమీరుద్దీన్

మెడికల్ పీజీ పరీక్షల్లో మోహిత్‌కు102వ ర్యాంక్



ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎయిమ్స్ పీజీ జాతీయస్థాయి పరీక్షల్లో కడప నగరానికి చెందిన కె.మోహిత్ 102 వ ర్యాంకు సాధించారు. ఎంబిబిఎస్‌లోనూ మంచి ర్యాంకు సాధించారు. తండ్రి రాజేంద్రప్రసాద్ డైట్ ప్రిన్సిపల్‌గా, తల్లి హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. 102 ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

'పాఠశాల సమయాలు మార్చాల్సిన అవసరం లేదు'

ప్రజాశక్తి -కడప అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల సమయాన్ని మార్చాలని, అందుకు అనుగుణంగా పైలట్ ప్రాజెక్టు కింద నెల్లూరు జిల్లాను ఎంపిక చేసిందని, ఇది సరి కాదని, ప్రస్తుతం ఉన్న సమయాలు పిల్లల మానసిక స్థితికి, సైకాలజీకి అనుగుణంగా ఉన్నాయని, మార్చాల్సిన అవసరం లేదని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎసివి. గురువారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లల సైకాలజీని బట్టి ప్రస్తుతం ఉన్న సమయం 9 గంటల నుంచి 4 గంటల వరకు బాగుందని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం వరకు ఐదు గంటల వరకు పెట్టడమంటే మానసికంగా, బోధనపరంగా ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు.

మసీదు సమీపంలో సంచరిస్తున్న పందులు

పట్టణంలో పందుల బెడద

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణ పరిధిలోని శాంతకుమారి వీధిలో పందుల బెడద తప్పించాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు. తమ వీధిలో పందులు విచ్చలవిడిగా తిరుగుతూ అపరిశుభ్రతను కలిగిస్తున్నాయని వాపోతున్నారు. అనారోగ్యాలకు గురవుతున్నామని, వైద్య ఖర్చులు భరించలేకున్నామని వాపోతున్నారు. ఇష్టా రాజ్యంగా పందులు సంచరిస్తుండడంతో పారిశుధ్యం పూర్తిగా లోపిస్తోందని, దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. ఈ వీధిలోని కొత్తపల్లె కాలువ పక్కన ఉస్మాన్ మసీదు ఉందని, పందులు గుంపులు గుంపులుగా మసీదు సమీపంలో తిరుగుతూ ఉండడం వల్ల ముస్లింలు మసీదుకు వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపట్ల మున్సిపల్ కమిషనర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని 25వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నూరి, స్థానికులు కోరుతున్నారు.

నేడు జమ్మలమడుగులో పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

విభిన్నప్రతిభావంతుల శాఖ ద్వారా ఎంపికైన వారికి సోమవారం పరికరాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు శనివారం ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. జమ్మలమడుగులో శ్రీనానుభాల యల్లప్ప కల్యాణ మండపంలో పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన లబ్ధిదారులకు కేటాయించిన పరికరాలు పొందవచ్చని ఎంపిడిఒ తెలిపారు.

రాములును పరామర్శిస్తున్న వేల్పుల రాము

వైసిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి - వేముల

స్థానిక అమ్మయ్యగారి పల్లి గ్రామపంచాయతీకి చెందిన వైసిపి సీనియర్ నాయకులు రాములును ఆ పార్టీ మండల పరిశీలకులు లింగాల రామ లింగారెడ్డి (వేల్పుల రాము) ఆదివారం పరామర్శించారు. రాములు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న రాము ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైద్యం ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పార్టీ కార్యకర్తలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్టీ నాయకులు అండగా ఉంటారని రాము పేర్కొన్నారు. వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన రైతు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతాప్‌రెడ్డి

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రైతు నంద్యాల చిన్న ప్రతాప్‌రెడ్డి తన పొలంలో అనపకాయలు కోస్తుండగా పాము కాటు వేసింది. హుటా హుటిన చికిత్స నిమిత్తం 108వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని డిగ్రీ కాలేజ్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇఇ జగదీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తేన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని ఎఇఇ కోరారు.

శివ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

గాయపడిన ఫొటోగ్రాఫర్‌కు చేయూత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని మల్లికార్జున గ్రామానికి చెందిన శివ అనే ఫొటోగ్రాఫర్ 10 రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మండల పరిధిలోని నల్లబడ్డపల్లె జిల్లా పరిషత్ పాఠశాల 1992-93 బ్యాచ్ విద్యార్థులు శివుడు ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆదివారం వారి కుటుంబ సభ్యులకు రూ.11వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని చాటుకోవాలని కోరారు.

ఎట్టకేలకు పిబిసి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పులివెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) కెనాల్ మరమ్మతు పనులను అధికారులు చేపట్టారు. కాలువలోని గడ్డి, పిచ్చి మొక్కల తొలగింపునకు దాదాపు రూ.18 లక్షలతో అధికారులు టెండర్లు పిలిచి పనులను ప్రారంభించారు. గతంలో గడ్డి, ఇతర పిచ్చి మొక్కల కారణంగా దిగువ ప్రాంతానికి(చివరి ఆయకట్టుకు) నీరు సరఫరా సక్రమంగా సాగేది కాదు. అధికారులు చర్యలు తీసుకుని పనులు ప్రారంభించడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఇఇ రాజశేఖర్ మాట్లాడుతూ కాలువలో పూడికను పూర్తిగా తొలగించడంతోపాటు ఇతర మరమతు పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. రైతుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. అంతకుముందు పులివెందుల బ్రాంచ్ కెనాల్ జెఇ రవికిరణ్‌తో కలిసి పనులను పర్యవేక్షించారు.

కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక తొలగిస్తున్న జెసిబి యంత్రం (ఫైల్‌ఫొటో)

అకాల వర్షం.. వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

తుఫాన్ ప్రభావంతో వర్షం పడుతుండడంతో వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలలో రైతులు కుందూ, బ్రహ్మసాగర్, పెన్నా, కేసీ కెనాల్, బోరు బావుల ఆధారంగా 50వేల ఎకరాలలో వరి పంట సాగు చేపట్టారు. ప్రస్తుతం వరి పంట వెన్ను దశలో ఉంది. వర్షం పడుతుండడంతో వెన్ను దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని రైతులు దిగాలు చెందుతున్నారు. అంతేకాకుండా అధిక వర్షానికి వరి పంట నేలకొరిగితే ధాన్యం దెబ్బతింటుందని వాపోతున్నారు. గత ఏడాది సరైన వర్షాలు లేక వరి పంట సాగు తగ్గింది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో వరి పంటను రైతులు అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం నూర్పిడి, వెన్ను దశలో ఉండగా తుఫాను ప్రభావంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చాపాడు మండల పరిధిలో 13వేల ఎకరాలు వెన్ను దశలో ఉంది. వర్షం ఇంతటితో ఆగకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

వెన్నుదశలో ఉన్న వరి పంట

అసెంబ్లీకి వెళ్తారా.. రాజీనామా చేస్తారా

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లకపోతే తన పదవికి రాజీనామా చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం పులివెందుల నియోజకవర్గ సమన్వయ కర్త ధ్రువకుమార్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వైసిపి అరచేతిలో వైకుంఠం చూపిస్తే, టిడిపి కూటమి ప్రభుత్వం కైలాసం చూపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ సూపర్ 6 హామీలు అట్టర్‌ప్లాప్ అయ్యాయన్నారు. సమావేశంలో లింగాల నాయకులు శంకర్‌రెడ్డి, పులివెందుల మండల నాయకులు జయచంద్రారెడ్డి, నాగరాజు, తొండూరు నాయకులు వినోద్‌రెడ్డి, వేముల నాయకులు వెంకటేష్, మహేంద్ర, సింహాద్రిపురం నాయకులు అమరనాథ్‌రెడ్డి, వేంపల్లి నాయకులు రాజు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి పార్టీ న్యాయం చేస్తుంది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి తెలుగుదేశం పార్టీ న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెహ్రూ రోడ్డులోని కార్యాలయంలో వాల్మీకి కుల బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన నల్లబోతుల నాగరాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టులు ఇచ్చారన్నారు. కులానికి సంబంధించి కొందరికి డైరెక్టర్, చైర్మన్ పదవి ఇచ్చారని, నాగరాజుకు బోయ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. కొందరు ప్రొద్దుటూరు నాయకులకు కూడా పదవులు ఇవ్వాలని కోరుతున్నా, నాగరాజుకు డైరెక్టర్ స్థాయి నుండి మరిన్ని ఉన్నత పదవులు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం టీవీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గల పార్టీ టిడిపి అని, పార్టీ ప్రతినిథిగా గుర్తించి మరిన్ని కార్యక్రమాలు చేయాలన్నారు. నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సుధాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం అనునిత్యం కష్టపడ్డాను.. తెలుగు యువత నాయకుడిగా నన్ను గుర్తించారని, ఇది పదవి కాదు తనకు భాధ్యత, మా కులం ఆర్థికంగా ఎదగాలన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కొండాపురం

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. కొల్లాపురం పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా నుండి జమ్మలమడుగు డిఎస్‌పిగా వచ్చానన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రత్యేకదృష్టి పెడతానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలనిర సూచించారు. మట్కా, గ్యాంబ్లింగ్, బెల్ట్ షాపులు, ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఆయన రికార్డులు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషి కేశవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు చేసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం కొత్తగా ఇంటి మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ శాఖ డిఇ సి.రమణారెడ్డి తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సోమవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు, భార్యా, భర్త ఆధార్ కార్డులు, బ్యాంకు అకౌంట్ బుక్, ఆదాయ సర్టిఫికెట్ జీరాక్స్ కాపీలు తీసుకొని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసేటప్పుడు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుందన్నారు. దరఖాస్తుదారుడు ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నెంబర్ సెల్‌ను వెంట తీసుకెళ్లానని ఆయన తెలిపారు.

సభ్యత్వ నమోదుతో ప్రయోజనం

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఐటీడీపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రావులపల్లె పంచాయతీలోని పాటిమీదపల్లె గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేవలం వంద రూపాయలతో రెండేళ్లపాటు రూ.5లక్షలు ప్రమాద బీమా ఉంటుందన్నారు. టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు, పాటిమీదపల్లె ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, బత్తల శివ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సచివాలయంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆదివారం ఎంపిడిఒ ముకుందారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ అప్డేట్, ఫొటో, చిరునామా, వేలిముద్రలు, ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవచ్చన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా డి.మల్లారెడ్డి, కె.మోహన్ రెడ్డి, శ్రీ లక్ష్మీ ఫైనాన్స్, ఎంఆర్ క్రియేటివ్ శ్రీగంధం ఫాంలాండ్స్ వారి సౌజన్యంతో సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి, అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ సూర్య, పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

తెలుగు భాష వెలుగుతూనే ఉంటుంది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తెలుగు ఓ వెలుగు.. తెలుగు భాషలో ఎంతోమంది కవులు, కళాకారులు, రచయితలు ఉన్నారని, వారి సేవలతో తెలుగు భాష వెలుగుతూనే ఉంటుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి తెలిపారు. జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో ఆదివారం రాత్రి లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్ పర్యవేక్షణలో లైబ్రరీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతికి అద్దంపట్టే నిలయం గ్రంథాలయం అన్నారు. తెలుగు భాషలో పద్య, గద్య కవితకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కవి అమీర్ మాట్లాడుతూ తెలుగు భాషలో సాహిత్య ప్రక్రియకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. పరభాషా పదాలను తనలో ఆకళింపు చేసుకుంటూ తెలుగు సొగసు ఉట్టిపడేలా ముందుకు సాగుతూనే ఉంటుందని వివరించారు. పద్య రచయిత సురేష్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సమస్యాపూరణానికి ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. దత్తపది, కంద పద్యం, తేటగీతి తదితర వాటి గురించి వివరించారు. మధుబాబు మాట్లాడుతూ కవిత్వం రాయాలన్నా, రచన చేయాలన్నా ఎంతో కృషి చేయాలన్నారు. దర్పణం శ్రీనివాస్ రచించిన అలుగోగు కథలను గురించి చక్కగా సమీక్షించారు. దర్పణం శ్రీనివాస్ ఓ చక్కని కవిత గానం చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. కవి గొరిగె వెంకటేశ్వర్లు తను రచించిన వేంకటేశ్వర శతకంలోని పద్యాలను పాడి వినిపించారు. చివరగా కవులను కశ్మీర్ శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లెక్చరర్ కృష్ణయ్య, రామయ్య, దాదా ఖలందర్, సుబ్బారెడ్డి, లక్ష్మీ నారాయణ, అశోక్

తెలుగు కవులను సన్మానిస్తున్న గ్రంథాలయ కమిటీ

ఉచిత 'గ్యాస్' అమలు లోపభూయిష్టం

మైదుకూరు కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం (దీపం 2.0) అమలు చాలా లోపభూయిష్టంగా ఉందని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.64 కోట్ల ఎల్పిజీ కనెక్షన్లు ఉంటే అందులో 55 లక్షలు దీపం, 9 లక్షలు ఉజ్వల, 5 లక్షలు సిఎస్ఆర్ కనెక్షన్లు పోనూ మిగిలినవన్నీ జనరల్ కనెక్షన్స్ ఉన్నా యన్నారు. ఈ పథకానికి ఎల్పిజీ కనెక్షన్, రైస్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉన్న వారందరూ అర్హులు అని కూటమి ప్రభుత్వం మొదట పెద్దగా ప్రచారం చేసిం దన్నారు. కానీ జీవో ఎంఎస్ నెం.12 ప్రకారం ఎల్పిజీ కనెక్షన్, రైస్ కార్డ్, ఆధార్ కార్డ్ డేటా ఇతర డిపార్ట్మెంట్ డేటాబేస్ వాలిడేషన్‌లో సరిపోవాలని నిబంధన విధించిందన్నారు. వాహనాలు, ఆస్తులు, కరెంట్ బిల్లులు, ఆధార్ నెంబర్‌తో వాలిడేషన్ చేయడంతో చాలామంది అనర్హులు అయిపో యారన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కూడా సబ్సిడీ పంపిణీ, ఎవరెవరికి సబ్సిడీ అందు తుంది అనే సమాచారం కూడా లేదన్నారు. ఆధార్ వాలిడేషన్‌కు సంబంధించిన సమాచారం సచివాలయ సిబ్బంది లాగిన్‌కు వచ్చేలా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ తరఫున తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

పని భారం.. వేధింపులు

ప్రజాశక్తి - ముద్దనూరు

మాట్లాడుతున్న ఆశా కార్యకర్త సుబ్బలక్ష్మి

ఇతర ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎం చేయాల్సిన పనిని తనతో చేయిస్తూ పని భారం మోపి వేధిస్తున్నారని ఆశా కార్యకర్త వై. సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మం డల కేంద్రంలోని 5వ వార్డు అంగన్వాడీ కేం ద్రం-1 పరిధిలో ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నానన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఎఎన్ఎం పని చేయ కుండా తన పని కూడా నాతో చేయిస్తుందని ఆరోపించారు. ఇతర ఆశా కార్యకర్తల పని కూడా తనతో చేయిస్తూ మానసికంగా, శారీ రకంగా వేధింపులకు గురి చేస్తోందని వాపోయారు. వేళా పాలా లేకుండా పనులు చేయాలని ఎఎన్ఎం ఇబ్బందులు పెడుతోందన్నారు. ఎఎన్ఎం వేధిం పులను పిహెచ్‌సి వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. తన పరిధిలో కేటాయించిన పనులు మాత్రమే చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

విచారిస్తాం

పిహెచ్‌సి జనాభా ప్రాతిపదికన ఆశా కార్యకర్తలకు విధులు కేటాయించాం. ఇరువురు ఆశా కార్యకర్తల సమ్మతంతో ఏడాది క్రితం అదనంగా కొన్ని కాలనీలు కేటాయించాం. మిగతా ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎం పని తీరుపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- కరిష్మా, వైద్యాధికారి

జాతీయ నాయకుల చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న పాఠకులు

జాతీయ నాయకుల పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఉద్యమ నాయకులను గురించి స్మరించుకున్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జాతీయ నాయకుల జీవిత చరిత్రను తెలిపే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఖాళీ సమయంలో పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - చాపాడు : స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఆదివారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారి జె.శివ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆటల పోటీలు, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి వారోత్సవాలలో చివరి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి తరచు వస్తూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ప్రొద్దుటూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఖురేషి సుమయ్య షాకీర్

ప్రొద్దుటూరులోని తక్వా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన షురేసి సుమయ్య షాకీర్ రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు ఎంపికయ్యారు. విద్యార్థిని తక్వా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎన్‌సిఈఆర్‌టి, ఎన్‌సియస్‌యం (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూసియమ్), విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వివి యం) 2024-25లో కడప జిల్లా నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠ శాల కర స్పాండెంట్ డాక్టర్ మహమ్మద్ షాకీర్ ఖురేషి తెలిపారు. రాష్ట్రస్థాయి క్యాంప్‌నకు ఎన్నికైన విద్యార్థిని కడప జిల్లా వివియం కో-ఆర్డినేటర్ రామిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ షాకీర్ ఖురేషి, ప్రధానోపాధ్యాయురాలు శిరీష, వివియం సెల్ కో-ఆర్డినేటర్ జయభారత్‌రెడ్డి, అధ్యాపకులు అభినం దించారు.

వరిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు : వరి పంటలో తెగుళ్లు అధికంగా ఉన్నాయని, రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ సూచించారు. మండల పరి ధిలో కెసి, కుందూ నది పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట వెన్ను దశలో ఉంది. పంటకు పలు రకాల తెగుళ్లు సోకాయి. దీనిపై వ్యవసాయ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటలో పాముపొడ, పచ్చ దోమ అధికంగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎక్సాకోనజోల్ 400 మిల్లీ లీటర్లు ఎకరానికి, నెగిటోవా 80 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పంటల సాగు ప్రారంభంలో విత్తనశుద్ధి చేసుకోవడం వలన తెగుళ్లను నివారిం చుకోవచ్చు అన్నారు. ప్రస్తుతం ఉన్న తెగుళ్లతోపాటు మెడ విరుపు సోకితే భీమ్ పిచికారి చేయాలని ఆమె సూచించారు.

శనగ, జొన్న, మినుము రైతుల్లో హర్షం

ప్రజాశక్తి - పెద్దముడియం : మండలంలో భారీ వర్షం పడింది. ఈ వర్షానికి రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రబీ సీజన్‌లో పదివేల ఎకరాల్లో శనగ, ఐదు వందల ఎకరాల్లో జొన్న, మూడు వందల ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. విత్తనం వేసి నెల రోజులు గడుస్తున్నా వాన చుక్క లేకపోవడంతో కాలువల ద్వారా మోటార్లతో పంటలకు నీళ్లు పారించేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఈ విధానంతో రైతులకు ఎకరాకు ఏడు వేల రూపాయలు వ్యయం అవుతుంది. ఈ నేపథ్యంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు 8,9,10, తరగతుల విద్యార్థులకు 'చదవడం (పుస్తకం) చూడడం (మొబైల్, టివి)', ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు 'మత్తు పదార్థాలు సమాజంపై ప్రభావం' అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ ఒక ప్రాంతంలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చిత్ర లేఖనం పోటీలు మునిసిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు.